క్లుప్తంగా

విస్తారంగా వర్షాలు



ఏలేశ్వరంలో పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

ఏలేశ్వరం: అల్పపీడనం ప్రభావంతో నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. వర్షాలకు చెరువుల్లోకి నీరు చేరి జలకళ సంతరించుకుంది. వర్షాలతో రైతులు ఖరీఫ్ పనులు ముమ్మరం చేశారు. వర్షాలకు పల్లపు ప్రాంతాలు, రహదారులు ముంపులోనే ఉన్నాయి. వర్షాలు ఎక్కువగా ఉండడంతో రహదారులు బురదమయంగా మారి, రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. అంటురోగాలు ప్రబలకుండా అధికారులు పారిశుధ్య పనులు పూర్తి స్థాయిలో చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలి

ఏలేశ్వరం: పట్టణంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం కమిషనర్ కె.శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. వర్షాలకు పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందన్నారు. ఐదో వార్డులో రోడ్లపై మురుగు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అంటురోగాలు ప్రబలే అవకాశం ఉన్నందున అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు బస్సు పాస్‌ల పంపిణీ



విద్యార్థులకు బస్సు పాస్‌లు పంపిణీ చేస్తున్న కంబాల

గోకవరం: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు ఆర్టీసీ బస్సు పాస్‌లను పంపిణీ చేశారు. గోకవరం, రంపయర్రంపాలెం, తంటికొండ తదితర జెడ్పీ హైస్కూళ్లకు వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న సుమారు 200 మంది విద్యార్థులకు మంగళవారం ఈ పాస్‌లు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్నదొర, డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గండేపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్సై ఎస్ రామకృష్ణ తెలిపారు. ఆయన వివరాల మేరకు, పెదపూడి మండలం జి.మామిడాడకు చెందిన కొత్తల శ్రీను (48) సూరంపాలెంలో ఓ ప్రైవేటు కళాశాలలో కార్పెంటర్ పని చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం టిఫిన్ చేసేందుకు బయటకు వచ్చి, కళాశాలకు తిరిగి వెళుతున్నాడు. ఈ క్రమంలో రాజమహేంద్రవరం వైపు నుంచి పెద్దాపురం వైపు వెళుతున్న లారీ వెనుక నుంచి అతడిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన శ్రీనును 108 అంబులెన్స్‌లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మరణించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య గొడవ పడిందని..

క్రిమి సంహారక మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్సై ఎస్ రామకృష్ణ తెలిపారు. ఆయన వివరాల మేరకు, యల్లమిల్లి గ్రామానికి చెందిన కాక నూకరాజు (20) తరచూ మద్యం తాగుతుండేవాడు. ఈ విషయమై నూకరాజు, అతడి భార్య భవాని సోమవారం గొడవ పడ్డారు. దీంతో మనస్థాపం చెందిన నూకరాజు పొలంలోకి వెళ్లి, క్రిమి సంహారక మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని బంధువులు చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున నూకరాజు మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫౌండేషన్‌కు రూ.లక్ష విరాళం

గండేపల్లి: పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్‌కు మండలంలోని జెడ్.రాగంపేటకు చెందిన కంటే సురేంద్ర రూ.1,00,800 విరాళం అందజేశారు. ఈ విరాళాన్ని మంగళవారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు అందించారు. సర్పంచ్ కందుల చిట్టిబాబు, మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి బాబ్జి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అన్న సమారాధన

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లిలో అభయ ఆంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం అన్న సమారాధన నిర్వహించారు. గ్రామస్తుల సహకారంతో కార్యక్రమం నిర్వహించినట్టు కమిటీ సభ్యులు పిల్లా సత్తిబాబు, దార్లంక శ్రీనివాస్, వల్లభశెట్టి చక్రి తదితరులు తెలిపారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్న ప్రసాదాలు స్వీకరించారు.

మరిడమ్మకు మఖ నక్షత్ర పూజలు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ తల్లికి మంగళవారం మఖ నక్షత్ర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభిషేకాలు పూజలు నిర్వహించారు.

కాజ్‌వే నిర్మాణం పూర్తయ్యేనా?

- ఏలేరు ఉధృతికి కుంగిపోయిన వంతెన
- పలు గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు
- ఇబ్బంది పడుతున్న పలు గ్రామాల ప్రజలు



ఏలేరు కాలువలో కుంగి ఉన్న వంతెన



వంతెనపై వెళుతున్న ద్విచక్ర వాహనం

ఏలేశ్వరం: ఏలేశ్వరం పరిధిలోని ఏలేరు కాలువపై నిర్మించి కాజ్‌వే(వంతెన) కూలిపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా దీని నిర్మాణంపై ఎటువంటి చర్యలు లేకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏలేశ్వరం నుంచి జగ్గంపేట గ్రామంలోని పలు గ్రామాల రాకపోకల నిమిత్తం ఏలేరు కాలువపై కాజ్‌వే(వంతెన) నిర్మించారు. ఈ కాజ్‌వే మీదుగా ఏలేశ్వరంతోపాటు దాని పరిధిలోని 8వ వార్డు(అప్పన్నపాలెం), పలు గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు.

ప్రమాదకరంగా వంతెన

నాలుగేళ్ల క్రితం ఏలేరు కాలువ ఉధృతికి కాజ్‌వే(వంతెన) కుంగిపోయింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీని పునర్నిర్మాణానికి ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో కాలువ నీటి ఉధృతి ఎక్కువకావడంతో వంతెన ఫిల్లర్ ఒరిగిపోవడంతో కుంగిపోయింది. గతంలో సుమారు 25 ఏళ్ల క్రితం రూ.99 లక్షల నిధులతో ఏలేశ్వరం నుంచి అప్పన్నపాలెం మీదుగా జగ్గంపేట మండలం ఇర్రిపాక, మామిడాడ, నరేంద్రపట్నం తదితర గ్రామాల రాకపోకలకు ఈ కాజ్‌వే నిర్మించారు. ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్న వంతెన ప్రమాదకరంగా ఉంది. ఏక్షణంలోనైన పూర్తిగా కూలిపోయే ప్రమాదముందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ప్రజల ఇబ్బందులు

ఏలేరు కాలువపై కాజ్‌వే కుంగిపోవడంతో దీనిపై వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జగ్గంపేట మండలంలోని ఇర్రిపాక, మామిదాడ, నరేంద్రపట్నం గ్రామాలకు దీని మీదుగా ఏలేశ్వరం మూడు కిలోమీటర్లు ఉంటుంది. ప్రస్తుతం ఏలేశ్వరం రావాలంటే సోమవరం, యర్రవరం మీదుగా సుమారు 15 కిలోమీటర్ల దూరం నుంచి రావల్సి ఉంటుంది. దీంతో పాటు ఎమర్జన్సీ అయితే ప్రజల పరిస్థితి దారుణంగా ఉంది. ముఖ్యంగా ఏలేశ్వరంలోని 8వ వార్డు ప్రజలు కాలువకు అవతలి వైపు ఉంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఏలేశ్వరం రావల్సి ఉంటుంది. వీరు వంతెన దెబ్బతినడంతో నానా యాతనలు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నానా ఇబ్బందులు పడుతున్నాం



ఏలేరు కాలువపై వంతెన కూలిపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నాం. కూలిపోయిన వంతెనపై రాకపోకలు సాగించాలంటే పిల్లలు, మహిళలు భయాందోనలకు గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– రౌతు సహదేవుడు, అప్పన్నపాలెం

ఉన్నతాధికారులకు నివేదించాం



ఏలేరుకాలువపై కూలిపోయిన వంతెన నిర్మాణంపై ఉన్నతాధికారులకు నివేదించడం జరిగింది. అధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

– కె.శివప్రసాద్, కమిషనర్, నగర పంచాయతీ, ఏలేశ్వరం

విశ్రాంత ఉద్యోగులకు హెల్త్ స్కీం వర్తింపజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పద్మనాభం

ప్రత్తిపాడు: ఎన్టీఆర్ వైద్య సేవా పథకం ద్వారా అన్ని వ్యాధులకు చికిత్స చేయించుకునే వెసులుబాటును విశ్రాంత ఉద్యోగులకు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కె పద్మనాభం ప్రభుత్వాన్ని కోరారు. ప్రత్తిపాడు సబ్ ట్రెజరీ కార్యాలయ ఆవరణలో మంగళవారం సాయంత్రం సంఘ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథి కె పద్మనాభం మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావలసిన పీఆర్‌సీ, డీఆర్ ఎరియర్స్ తక్షణం మంజూరు చేయాలన్నారు. అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్స్ విషయంలో 69 ఏళ్లు నిండాక, 70లోకి ప్రవేశించిన వెంటనే అమలు చేయాలన్నారు. సమావేశంలో సంఘ జిల్లా కార్యదర్శి టి నూకరాజు, కోశాధికారి పీవీ రమణ తదితరులు విశ్రాంత ఉద్యోగులు సమస్యలను వివరించారు. సంఘ మండల అధ్యక్షుడు వైవీ రామం అధ్యక్షత వహించారు. సంఘ నాయకులు బర్రే కోటేశ్వరరావు, బొడ్డేటి ఆదిరాజు, ఎ.శేషగిరిరావు, జంధ్యం సుబ్బారావు, ఎం సుబ్రహ్మణ్యం, యు.పెంటమ్మ, ఎస్.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



తునిలో తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీలత

తుని రూరల్: తుని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు మంగళవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తుని పట్టణం కొండవారిపేట (2, 3 వార్డుల) అంగన్‌వాడీల ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు, అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథి సీడీపీఓ కె.శ్రీలత ముర్రుపాలు శిశువులకు తాగించడం వల్ల తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. తల్లిపాల ఆవశ్యకతను ప్రతి మహిళా తెలుసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏసీడీపీఓ నిహారిక, సూపర్‌వైజర్ సరస్వతి, చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ రాణి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. తుని మండలం టి.వెంకటాపురంలో సూపర్‌వైజర్ వి.విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో లబ్ధిదారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.

ఈ-క్రాప్‌తో రైతులకు మేలు



లింగంపర్తి గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి



గోకవరంలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది



మల్లిపాకలో పొలం వద్ద రైతు సమక్షంలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న సిబ్బంది

ఏలేశ్వరం: ఈ క్రాప్ బుకింగ్‌తో రైతులకు మేలు జరుగుతుందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని లింగంపర్తి గ్రామంలో మంగళవారం పంట నమోదుపై రైతులతో గ్రామసభ నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎంపీపీ బుజ్జి మాట్లాడుతూ రైతులు తాము పండించిన ప్రతి పంటను నమోదు చేయించుకోవాలన్నారు. ఈ-క్రాప్ నమోదుతో రైతులకు మేలు చేసేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. రైతులకు బీమా సౌకర్యం, పంటనష్టం అందాలంటే ఈ-క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జ్యోతుల పెదబాబు, పెంటకోట మోహన్, చిక్కాల లక్ష్మణరావు, పెంటకోట శ్రీధర్, నూకతాటి ఈశ్వరుడు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన గృహ నిర్మాణ శాఖపై సమీక్ష సమావేశం జరిగింది.

ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలి

గోకవరం: రైతులు విధిగా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజరాజేశ్వరి తెలిపారు. కౌలు రైతులు స్థానిక వీఆర్వో నుంచి కౌలు పత్రాలు తీసుకుంటేనే వారి వివరాలు ఈ–క్రాప్‌లో కనిపిస్తాయన్నారు. రైతులంతా రైతు సేవా కేంద్ర సిబ్బందికి సహకరించి, బయోమెట్రిక్ వేసి ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. దీనివలన పంట రుణం పొందేందుకు, ధాన్యం కొనుగోలుకు, ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా వంటివి పొందడానికి అర్హులవుతారన్నారు. వరి, మామిడి, జీడిమామిడి, పామాయిల్ వంటి పంటలు పండిస్తున్న రైతులు సెప్టెంబర్ 15 నాటికి ఈ-కేవైసీ చేసుకోవాలన్నారు.

జగ్గంపేట: ప్రభుత్వం అందించే వివిధ పథకాలు అందుకోవాలంటే తప్పనిసరిగా రైతులందరూ ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని జగ్గంపేట మండల వ్యవసాయధికారి రెడ్ల శ్రీరామ్ తెలిపారు. మండలంలోని మల్లిపాక గ్రామంలో మంగళవారం హార్టికల్చర్ అసిస్టెంట్ అనూష ఆధ్వర్యంలో వరి పంటను ఆయన పరిశీలించారు. ఈ–క్రాప్ నమోదుకు అవసరమైన పత్రాలు, దీనివల్ల ప్రయోజనాలను వివరించారు. రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ తనిఖీ

కాకినాడ సిటీ: అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆర్డీవో ఇట్ల కిశోర్ ఆకస్మిక తనిఖీ చేశారు. రెవెన్యూ దస్త్రాలకు సంబంధించి సురక్షిత చర్యలు చేపట్టాలని, రికార్డు రూమును పరిశీలించి, అగ్నిమాపక నిరోధక యంత్రాలు ఏర్పాటు చేయాలన్నారు. రక్షణ చర్యలు చేపట్టాలని, ఆఫీసు పరిసరాలు పరిశీలించి, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఈ తనిఖీలో ఆర్డీవో కిశోర్ వెంట డిప్యూటీ తహసీల్దార్లు పవన్, ఆనంద్, దీపక్‌రాజు, ఇతర సిబ్బంది తదితరులు ఉన్నారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం



సూర్యారావుపేట బీచ్ వద్ద ధ్వంసం చేసేందుకు సిద్ధంగా ఉంచిన మద్యం సీసాలు, సారా

కాకినాడ రూరల్: మండలంలోని సూర్యారావుపేట బీచ్ వద్ద ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ ఎదురుగా సీసీ రోడ్డుపై వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం, సారాను పోలీసులు, ఎస్ఈబీ సిబ్బంది మంగళవారం ధ్వంసం చేశారు. కాకినాడ సబ్ డివిజన్ పరిధిలో 261 కేసులకు సంబంధించి రూ.9.63 లక్షల విలువైన 2170 లీటర్ల మద్యం సీసాలను జేసీబీ సహాయంతో ధ్వంసం చేసినట్టు డీఎస్పీ హనుమంతరావు, ఎస్ఈబీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈఎస్‌బీ సూపరింటెండెంట్, సీఐలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఆన్‌లైన్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం జరుగుతుందని యూనివర్సిటీ ఛాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి మంగళవారం ఇక్కడ తెలిపారు. మెషీన్ లెర్నింగ్, జనరేటివ్ కృత్రిమ మేధస్సు అనే అత్యాధునిక అంశంపై ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇప్పటికే మొదలైన ఈ కార్యక్రమం ఈ నెల 16 వరకు కొనసాగుతుందన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

కిర్లంపూడి: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జగపతినగరం సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత అధికారులకు సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి కొట్టుకొచ్చిన చెత్తచెదారాలతో డ్రైనేజీలు పూడిపోవడంతో, వరద నీరు రోడ్లపైకి పోటెత్తింది. దీంతో సర్పంచ్ ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది మంగళవారం జగపతినగరంలోని డ్రైనేజీల్లో పేరుకున్న చెత్తను పొక్లెనైన్ సాయంతో తొలగించారు.వార్డు మెంబర్ అళ్ల శ్రీమన్నారాయణ, పలువురు నాయకులు పర్యవేక్షించారు.

ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్లు

జగ్గంపేట: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో బేతేలు ప్రార్థన మందిరం, కాకినాడ సూర్య గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వివిధ రకాల వ్యాధులకు సంబంధించి 150 మందిని పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ అడ్మినిస్టేటివ్ ఆఫీసర్ తిరుపతిరావు మాట్లాడుతూ జగ్గంపేట ప్రాంతంలోని పలు గ్రామాల్లో ఉచిత వైద్య సేవలందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, హాస్పిటల్ డాక్టర్లు పాల్గొన్నారు.

రాకపోకలు లేక జనం పస్తులు

రహదారి కల్పించాలని ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న కాలనీ వాసులు

పిఠాపురం: గొల్లప్రోలు పట్టణ పరిధిలో కొత్తగా నిర్మించిన కాలనీవాసులకు రాకపోకలకు దారి లేక తాగునీరు, ఆహారం లేక పస్తులుంటున్నారని అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ ధర్నా నిర్వహించారు. మొదటగా ఉధృతంగా ప్రవహిస్తున్న కొండ కాలువ వద్ద ధర్నా చేసి అక్కడ నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం జాతీయ రహదారిపై బైఠాయించి నినాదాలు చేశారు. ముంపు బాధితులకు తాగునీరు ఆహారం అందించి శాశ్వతంగా రాకపోకలు సాగించేలా కృషి చెయ్యాలని నినాదాలు చేశారు. యూనియన్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు కుంచె అంజి బాబు మాట్లాడుతూ ముంపు బాధితుల సమస్యలు పట్టని జిల్లా అధికారులు ఎందుకని, విధులు మరచి కాలక్షేపం చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించకపోతే అంతకన్నా దౌర్భాగ్యం మరొకటి ఉండదన్నారు. వెంటనే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ ఉన్నతాధికారులు స్పందించి కాలనీ వాసుల సమస్యలు పరిష్కారానికి శ్రీకారం చుట్టాలని పేర్కొన్నారు. యూనియన్ నాయకులు గుడాల చార్లెస్, కేశవరపు వీరన్న, గొర్ల శివ, ఎస్ శంకర్, కొశిరెడ్డి గణేష్ పలువురు కాలనీ వాసులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై సతీష్ బాధ్యతల స్వీకరణ



ఎస్సై సతీష్



ఎస్సై పవన్‌కుమార్

కిర్లంపూడి: కొత్త కిర్లంపూడి ఎస్సైగా జి.సతీష్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఏలేశ్వరం పోలీసు స్టేషన్ నుంచి ఈయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై షేక్ జబీర్‌ను ఏలూరు రేంజ్‌కు వీఆర్‌కు అటాచ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై సతీష్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణపై దృష్టి సారించనున్నట్టు తెలిపారు.ప్రజలు సహకరించాలని కోరారు.

గోకవరం ఎస్సైగా వెంకట పవన్‌కుమార్

గోకవరం: కొత్త గోకవరం ఎస్సైగా వి.నాగవెంకట పవన్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన కె.నాగరాజు బదిలీ కావడంతో, ఆయన స్థానంలో పవన్‌కుమార్ వచ్చారు. గతంలో ఆయన రాజానగరం ఎస్సైగా బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



కొత్తూరులో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సౌమ్యశ్రీ

శంఖవరం: డెంగీ కారణంగానే రక్తంలో ప్లేట్‌లెట్లు తగ్గుతాయని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు. కొత్తూరు గ్రామంలో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఒళ్లు నొప్పులు, కాళ్లు లాగడం, వాంతులు, చలి జ్వరం, పళ్ల చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తే, వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జాబ్ మేళా



నియామకపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

జగ్గంపేట: జిల్లా వికాస కేంద్రం, జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో జెడ్పీ మాజీ చైర్మన్ నవీన్‌కుమార్ పర్యవేక్షణలో జగ్గంపేటలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన 350 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 171 మంది 15 కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నియామక పత్రాలు అందజేశారు. జిల్లా వికాస సంస్థ పీడీ లచ్చారావు, వివిధ కంపెనీల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పునరుద్ధరించాలి



రాజా కళాశాల విద్యార్థులతో రాము

తుని: ప్రభుత్వ ఇంటర్మీడియెట్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పునరుద్ధరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.రాము డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రాజా ప్రభుత్వ జూనియర్ కాలేజీని ఆయన సందర్శించి, విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని రద్దు చేశారన్నారు. ఈ పథకాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. కనీస మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం

కిర్లంపూడి: పరిశుభ్రమైన మంచి నీటిని తాగడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. వీరవరంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ తోట గాంధీ, సర్పంచ్ అంబటి బుజ్జమ్మ, ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కళ్లజోళ్ల పంపిణీ



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు

తుని: సామాజిక సేవలో రోటరీ క్లబ్ ముందుంటుందని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక రోటరీ ఆధ్వర్యంలో 13 మంది దివ్యాంగులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పని చేసే స్మార్ట్ విజన్ కళ్లజోళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఒక్కొక్క కళ్లజోడు విలువ రూ.31,500 అన్నారు. వీటి కోసం రూ.4.1 లక్షలు ఖర్చు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు రావూరి సుబ్బారావు, విశ్వనాథ్, వీర్రాజు, కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.